
# ఆశోపహతుడు

క.నం. 74803



నీలం రామారావు

"చూడబ్బాయీ! అలివేణికి చీరలు లేవు. ఒంటిన మంచి బట్ట లేదు. రెండు చీరలు పట్టుకురారా." తల్లి సిగ్గుపడుతూ చెప్పింది. చెప్పక తప్పదు. తప్పని పరిస్థితి.

కోడలు అలివేణిని చూస్తుంటే ఆమె గుండె తరుక్కుపోతున్నది. నిన్న పేరంటానికి తప్పనిసరిగా వెళ్లవలసివచ్చింది. కోడలూ, తనూ వెళ్లారు. ఒంటిన మంచి బట్టలేక, మెళ్లో నగలులేక నలుగురిలోనూ ఎబ్బెట్టుగా కనిపించింది అలివేణి. ఆమెకు కన్నీళ్లు తిరిగాయి. ఎవరో అంటున్నారు—"జానకమ్మ కోడలమ్మా ఆవిడ!" అని. అందులో వ్యంగ్యం నూరుపాళ్లూ ఉంది. కొందరు మూతులు విరుచుకున్నారు. అంతా చూసింది; అన్నీ విన్నది. సహించలేక, చేసేదేమీలేక, పేరంటం మధ్య లేచిపోవడం సభ్యతకాదు కాబట్టి — జీవితంలో ఎన్నడూ ఎదుర్కోని అవమానానికి దుఃఖాన్ని దిగమింగుతూ, ఇక్కడికి రాకపోయినా బాగు అనుకుంది.

> **డబ్బుకు, ప్రాణానికి లంకె. ఖర్చుపెట్టడు. తనను అన్నవాళ్ళను లెక్కచేయడు. డబ్బు విషయంలో స్వపర భేదమూ చూడడు అలాంటి వ్యక్తి. అలాంటప్పుడు అతని బాధ్యత ఎంత?**

"అదేమిటి అమ్మా! పండుగ వెళ్లి పది నెలలయినా కాలేదు, కొనిన రెండు చీరలూ ఏమయ్యినట్టు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు సుందరం. ఆ ప్రశ్నలో — ఇంటికొస్తే ఇవే గొడవలనే విసుగుదల, కొన్న చీరలు ఏమయాయనే అనుమానం, కొనదలిస్తే డబ్బు ఖర్చనే భయం ఇత్యాది భావాలు అంతర్లీనమై ఉన్నాయి.

కొడుకు మాటలకు తల్లి నిర్విణ్ణురాలయింది. పెద్దపండుగకుకొన్నాడు చెరొక రెండు చీరలు. పది నెలలు గడిచాయి. వాటినే ఉతికి వాడుతుంటే ఇంకా ఉంటాయా? ఈమాత్రం అర్థంచేసుకోలేని వివేకశూన్యుడా తన కొడుకు! పాతవి ఉండగా కొత్తవి కొనరాదనా వాడి ఆంతర్యం ... తన కాలంలో తను వద్దని పోరుపెట్టినా నెలకొక చీర తెచ్చిపడేసేవారు 'వారు'. వారి బుద్ధులు కొడుక్కు లేవు. అసలు — కట్టుకున్న భార్యను సుఖపెట్టాలని లేదు. కన్న బిడ్డలను సంతోషపరుద్దామని లేదు. తన సంగతి సరేసరి. 'వారి' తో పాటు తనూ తనువు చాలించి ఉంటే బ్రతికిన తన జీవితానికొక ప్రతిపత్తి ఉండేదేమో! ఆమె కన్నుల్లో కన్నీళ్లు పొర్లాయి.

"నాయనా! సంవత్సరానికొకతూరి — కొన్న రెండు చీరలూ ఏమయాయనే ప్రశ్నకు సమాధానం ఆశిస్తే — నా నోటిమీదుగా కాదు, స్త్రీ జన్మయెత్తిన ఏ వ్యక్తయినా అడుగు. చెప్తుతుంది."

"ఇంతకీ ఈ డొంకతిరుగుడు దేనికి?

కంటి రక్షణకు, సౌందర్యానికి
దర్బార్ కాటుక (రిజిస్టర్డు)





రాంబీర్ కంపెనీ, బొంబాయి-4.

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక

క్రోధి ఉగాది నవలల పోటీ

మొదటి బహుమతి రు 2,000 లు
రెండవ బహుమతి రు 1,000 లు
మూడవ బహుమతి రు 500 లు

పోటీలో పాల్గొనేవారు పాటించవలసిన నిబంధనలు:

1. రచన 250 పావుతావు కాగితా లకు మించరాదు.
2. సిరాతో, కాగితానికి ఒక ప్రక్కనే వ్రాయాలి.
3. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
4. స్వీయరచనలే కాని అనువాదాలు పంపరాదు.
5. బహుమతి పొందని నవలలో యోగ్యమైనవి ఆంధ్రప్రభసచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
6. రచన పంపేటప్పుడు కవరుమీద 'ఉగాది నవలల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.
7. బహుమతి పొందని రచనలలో ప్రచురణార్హం కానివాటిని తిప్పి పంపే నిమిత్తం తగుమాత్రం తపాలా బిళ్ళలు అంటించిన, చిరు నామా కలిగిన కవరు జతపరిచి పంపవలసి ఉన్నది. లేకపోతే వాటిని తిప్పి పంపడం జరుగదు.
8. రచనలు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, మద్రాసు'కు పంపాలి.

బహుమతి పొందిన నవలల ప్రచురణ ఉగాది ప్రత్యేక సంచికలో ప్రారంభం అవుతుంది

ఉగాది నవలల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరి తేది | 1964 ఫిబ్రవరి 29

## ఆశోపహతుడు

నూటిగా చెప్తే పోలా?"

"అర్థం చేసుకోవాలేగాని ఒకరు చెప్తే అర్థమయ్యే విషయాలు కావివి. ఏ యింటి ఆడబిడ్డరా, సంవత్సరం పొడుగునా పండుగులకు పేరంటాలకు రెండే రెండు చీరలతో నెట్టు కొచ్చేది? దానిని చూడు. ఒంటిన బట్ట ఎంత ఉందో! ఉన్నది సరిపోయినదో లేదో నీకే తెలుస్తుంది. నీ భార్య ఆ విధంగా ఉందంటే తలవంపు నీకుగాని దానికి కాదు. నాకన్నావా — జీవిత సంధ్యలో పడ్డాను. మీ నాన్నగారి కాలంలో తృప్తిగా గడిచింది. నా గురించి నీకు సమస్య లేదు. కాని, నీవు తాళికట్టిన భార్య గురించి, నీవు కన్న బిడ్డల సుఖసంతోషాల గురించి ఒక్క పర్యాయం ఆలోచించు. ఇన్ని చెప్పడానికి అడ్డాలనాటి బిడ్డడవుకావు. చెప్పడం నాకూ భావ్యం కాదు. ఏదో కన్నతల్లిని గాబట్టి చెప్పగలిగాను. నే చెప్పేది ఒక్కటే, తండ్రీ! నీ సంసారాన్ని, మీ జీవితాలను సుఖమయం చేసుకోమని."

మాతృ హృదయం, పుత్రుని సంకుచిత తత్వానికి సిగ్గుపడింది. తన కొడుకు ప్రయో జకుడయాడు. దైవకృపవల్ల పెళ్లయిన రెక్కెల్లమంచే ఉద్యోగంలో చేరి మహారాజులా సంపాదిస్తున్నాడు. రాబడికి లోటు లేదు. కాని — ఇంట్లో పుష్టిగా తినడానికి ఎవరికీ స్వాతంత్ర్యం లేదు. అందరికీ 'రేషను' తిండి. బట్టా అంతే. నయాపైసా ఖర్చంటే భోరున ఏడుస్తాడు. వాడిని బోలిన సంకుచితగుణం తమ వంశంలో తన ఎరికలో ఎవరికీ లేదు. వాడికి ఎలా సంక్రమించిందో! ఏ అసుర సంధ్యలో తన కడుపున పడ్డాడో!

"ఇంట్లో కూర్చుని ఎన్నయినా చెప్తావులే, అమ్మా. కష్టపడ్డవాళ్లకి తెలుస్తుంది కష్టం విలువ! ఇప్పుడు మధ్యంతరంగా బలవంతం చేస్తే నేనెక్కడ చచ్చేది డబ్బుకి?"

జానకమ్మ గుండె గతుక్కుమంది. "బాగా అన్నావు, నాయనా! కష్టపడ్డవాళ్లకి తెలుస్తుంది కష్టం విలువ! లోకంలో నీవే కష్టపడు తున్నావు. కష్టమంటే నీకొక్కడికే తెలుసు. నవమాసాలూ మోసి కని పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు గరపి పెళ్లిచేసిన నాకు కష్ట మంటే ఏం తెలుసును? నీవింతగా బాధపడతా వనుకుంటే నేనసలు ఈ ప్రసక్తే ఎత్తక పోదును. పోనీ, పరాయివాళ్ల గురించి చెప్పా నటరా? నీ భార్య గురించి. అవునులే, కందకు లేని కండూతి కత్తిపీట కెందుకట?" కన్నీళ్లు నేలను పడుతూంటే బరువుగా అడుగులు వేసుకుంటూ కదిలిపోయింది.

తల్లీ కొడుకుల సంభాషణ విని, నీళ్లు నిండిన కళ్లతో ఉదాసీనంగా ప్రక్క గదిలోకి వెళ్లిపోయింది అలివేణి.

సుందరం మనసు చివుక్కుమంది తల్లి మాటలు విని. తనన్న ఒక్క మాటకు ఆమె ఇంత ఆవేశం తెచ్చుకుంటుందనుకోలేదు. ఇంటికి వచ్చిందిమొదలు అవి లేవు, ఇవి లేవు అని ఒకటే పోరు. అన్నిటికీ తన సంపాదనే. రెక్కలు విరుచుకుని రోజల్లా కష్టపడుతున్నాడు. కాని సంపాదించాలంటే ఎంత శ్రమను ధార పోస్తున్నాడో తను! అవన్నీ వీళ్లకేం తెలుసు? తనను తల్లి దెప్పుతుంది, తండ్రి బుద్ధులు అబ్బలేదని. నిజమే. తండ్రి చేసిన నిర్వాక మేమిటి? తనువు చాలిస్తూ చిల్లిగవ్వ ఇవ్వ లేదు సరిగదా — తనపై భారం తల్లీ — భార్యా — పిల్లలను ఉంచి పోయాడు.

ఆలోచనలతో సుందరం విసిగిపోయాడు. ఈ విధమైన ఆలోచనలు ఈనాడే కాదు, ప్రతి రోజూ అతన్ని వెన్నాడుతూనే ఉంటాయి.

సుందరంను కొందరు అసహ్యించుకుంటారు. అందవికారిఅని కాదు, చదువులేనివాడని కాదు, పరమలోభి — అందుకు. డబ్బుకూ, అతనికీ లంకె. పైసా ఖర్చుపెట్టిన పాపాన పోడు. ఖర్చుపెట్టవలసి వచ్చినపుడు దానికి కారకులెవరో, వాళ్లను, ఆ రోజు కాదుగదా, ఒక నెలవరకూ లోలోపల తిట్టుకుంటూనే ఉంటాడు.

సుందరం ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. నెలకు నూట ఇరవై జీతం. ఇదిగాక సాయంత్రం వేళల్లో షాపుల్లో పద్దులు వ్రాస్తూ, వాటి తాలూకు ఇంగ్లీషు ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూ ఈ బాపతు అదనపు పనివల్ల ఒక అరవై కిట్టించుకుంటున్నాడు. అయినా సంతృప్తి లేదు. ఇంటివద్ద ముగ్గురు పిల్లలకు చదువు చెపుతున్నాడు. ఈ మార్గంలో పద్దెనిమిది రూపాయలు. ఈ ఆదాయనికే ఎదురింటి పంతులుగారికి వచ్చే ముప్పయి రూపాయల ఆదాయాన్ని పోగొట్టి, తను పద్దెనిమిది రూపాయలకే పోటీపడి పంతులు పొట్టకొట్టాడు. వెరసి, నెల సంపాదన రెండు తక్కువ రెండు వందల రూపాయలు. తల్లికి, భార్యకు తెలిసింది ఉద్యోగం బాపతు ఎనభై రూపాయలే. ప్రైవేట్ల తాలూకు పద్దెనిమిది. అయితే ఇంటి ఖర్చులకుగాను కేటాయించింది నెలకు ఏభయి రూపాయలు. పండుగలకు, పబ్బాలకు ప్రత్యేకంగా మొత్తంమీద యిరవయ్యి రూపాయలు. సంవత్సరాని కొకతూరి ఇంటిల్లిపాదికీ బట్టలకుగాను వంద రూపాయలు. ఉన్న యిల్లు సొంతం. సుందరం అంచనా మేరకు కాక ఎక్కువ ఖర్చయితే నెలరోజులు సణుగుకుంటాడు. అందుకనే తల్లికి, భార్యకు కూడా అతనంటే ఏహ్యం.

తనుచూచి ఏమేమో అనుకున్నవాళ్ళను లెక్క చేయడు సుందరం. తనదృష్టిలో వాళ్ళందరూ దుబారావరులు, డబ్బంటే లక్ష్యం లేనివాళ్ళు, చేతిలో ఉన్న పైకాన్ని విచ్చలవిడిగా ఖర్చుపెట్టి చేతులు ఖాళీకాగానే — ఎదుటివాడి ఔన్నత్యాన్ని చూచి సహించలేనివాళ్ళు.

* * *

"చూడు! అలివేణీ! పండుగకు కొన్న చీరలు అప్పుడే ఏవగింపయాయటే— కొత్తచీరలు కొన డానికి? గడపదాటి బయటకు కాలుమోపని మీకు చీరలెలా పాడవుతాయో—అదే నాకర్థం గాకుండా ఉంది!"

"ఏవగింపని అన్నదెవరు? ఉతకడం వల్ల చివికిపోయాయేగాని అతుకులేసి కుట్టడం వల్ల ఈరెణ్ణెల్లూ గడిచిపోతాయిలెండి."

"అదీ. అలా సర్దుకుపోడానికి ప్రయత్నించాలే గాని మోజుకుపోయి బట్ట కట్టినంతమాత్రాన నటే గొప్పనిపించుకునేది? పూర్వం ఈ బట్టలూ, అవీ ఉండేవా? అయితే వాళ్ళకు రోజులు గడవ లేదూ?"

అలివేణి సమాధానం ఇవ్వలేదు.

"చూడు, రోజులు మారిపోతున్నాయి. డబ్బుకిచ్చే విలువ మనిషికివ్వటం లేదు. డబ్బుని చూసి మనిషిని గౌరవిస్తున్నారు."

ఈదరగాలి తెరలుతెరలుగా వచ్చిపడింది. నిదుర పోతున్న చంటాడు ముడుచుకు పోయాడు. అందని పైట చెరగు వాడికి కప్పటానికి అలివేణి వ్యర్థప్రయత్నం చేసింది. మూడేళ్ళ అమ్మాయి "అమ్మా! చలేస్తూంది" అని ఏడుస్తున్నది. అలివేణి కన్నుల్లో కన్నీటిపొరలు అలలుగా చెలరేగాయి.

"నా ప్రయత్నం అంతా అందుకే. నన్నెవరూ అర్థం చేసుకోరు. కనీసం అర్థాంగివి, నీవైనా లేదు. ఈరోజుల్లో కష్టాలు పడయినా డబ్బు నిలువచేయ గలుగుతున్నామంటే, సుఖాల మేడలకు సోపానాలు నిర్మించుకుంటున్నాము. కాని మీరు వాటి తాలూకు పునాదులనే కెలికి వేస్తున్నారు."

చివరిమాట అలివేణి హృదయాన్ని రంపపు కోత కోసినట్లయి, ఆమె కనులనుండి రుధిరమే కన్నీరుగా ప్రవహిస్తుందా అనిపించింది.

చల్లగాలి కిటికీ రెక్కలను దూసుకువచ్చింది. సుందరం నరుచుకున్న గుడ్డనే పైకి లాగి కప్పుకున్నాడు. అమ్మాయి "అమ్మా! చలే" అంటూనే ఉంది. అలివేణి లేచి పెట్టెలోని తన రెండోచీర పిల్లదానికి కప్పింది.

పునాదులను కెలికి వేస్తున్నారు. ఎవరు? ఎవరి నుద్దేశించి అన్నమాటలవి? తననా? తన బిడ్డలనా? అత్తగారినా? ఎవరిని? తనకు పెళ్ళయి ఐదు సంవత్సరాలు కావస్తున్నది. సుందరం భర్తకావడం—తనేనాడో పాపంచేసి పుట్టింది. ప్రత్యక్ష నరకాన్ని కళ్ళ జూస్తున్నది. అందమైన బట్టలేదు. ఒంటిన ఒక్క నగలేదు, మంగళ సూత్రం తప్ప. తినతిండి పుష్టిగా లేదు. వాక్స్వాతంత్ర్యం లేదు. గృహిణికి ఉండవలసిన పెత్తనం లేదు. తన బిడ్డలకు సుఖం లేదు. వాళ్ళూ తనకుమల్లే పాపం చేసుకున్న వాళ్లేనేమో! తను భార్యగా కాలం గడుపుతున్నదంటే భర్త శారీరక వాంఛలను నెరవేర్చేందుకేనేమో! యం


ఇంకా పొడుగు ఎదగండి



మా నూతన వ్యాయామాలు ఆహార నియమాల కమం అనుసరించి ఇతోధికమైన ఆరోగ్యం కూడా చేకూర్చుకోండి. స్త్రీ పురుషుల ఉభయులకూ అనుకూలమైనది. వివరములు ఉచితంగా పొందవచ్చును.

283, Azad Market (A.P.V.),
Delhi-6.




శ్రీమదాంధ్ర మహాభారతము

వచన కావ్యము

తింటే గారెలే తినవలయును. చదివితే భారతమే చదువ వలయునను నార్యోక్తి ననుసరించి యెల్లరు చదువతగిన ఈ పంచమ వేదముశుద్ధప్రతిగా గ్లేజు కాగితముపై ముద్రించి యున్నాము. రాయలు ⅛ సైజు.

ఆది పంచకము పూర్తి సెట్టు రు.20—00

విడి విడి భాగములు.

| | | | |
|---|---|---|---|
| ఆది పర్వము | వచనము | రూ. | 6—00 |
| సభా పర్వము | ,, | ,, | 2—00 |
| ఆరణ్య పర్వము | ,, | ,, | 8—00 |
| విరాటపర్వము | ,, | ,, | 4—00 |
| ఉద్యోగ పర్వము | ,, | ,, | 4—00 |

పోస్టేజి ప్రత్యేకము

బాలసరస్వతీ బుక్ డిపో, మద్రాసు-1.

SWASTIK

త్రంలా ఇంటి పనులు చేయడానికేనేమో! దాని నకూ, తనకూ భేదం లేదు.... అలివేణి ఆలోచ నల్లో పడి అలసి నిదురపోయింది.

భార్య వింటున్నదనే— సుందరం ఏవేవో చెప్పుకుపోతున్నాడు.

నిదురలో ఏదో మధురిమ ఉన్నదంటారు. అలివేణి తీరని కోరికలు స్వప్నాలుగా సంతృప్తి నిస్తున్నాయి. తను బెనారసు చీర కట్టుకుంది. పట్టు రవిక, మెడలో చంద్రహారం, చేతికి బంగారు గాజులు, తలలో మల్లెలు. రేడియో ముందు కూర్చున్నది. ఎవరో కళ్ళు మూశారు. చేతులు విడిపించుకుంది. భర్త నవ్వుతూ తన దిశగా తిరిగి చేరువకు తీసుకుంటూ తలలో

## ఆశోపహతుడు

మల్లెల మధ్య గులాబీలు తురుముతున్నారు. పిల్లలు నవ్వుతూ కేరింతలు కొడుతూ వచ్చారు. ఇద్దరు పిల్లలూ తామిరువురినీ చుట్టుకు పోయారు. "గృహమేకదా స్వర్గసీమా" పాట వినిపిస్తున్నది..... చల్లగాలి విసురులకు కల చెదరిపోయింది.

• • • •

ఇటీవల సుందరంకు అడపాదడపా జ్వరం వస్తున్నది. విపరీతమైన శిరోబాధ, కనులనుండి నీరు కారుతుండడం, వరుసన రెండు రోజులు బాధపడేవాడు. వైద్యం లేదు. అందుకనే అది తాత్కాలికంగా బాధోపశమనమయినా వారాని కొకతూరి తిరగతోడేది. తల్లి పోరుపడలేక, వైద్యానికి పైకం వ్యయమవుతుందని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్ళేవాడు. వాళ్ళిచ్చిన రంగునీళ్ళు తాగేవాడు. ఇప్పుడు వ్యాధి తీవ్రరూపం దాల్చింది. జ్వరం. శిరోబాధ. కళ్ళు ఎర్రబడడం. సంధ్య వేళల్లో దృష్టి మందగించడం.

"డాక్టరుకు చూపించలేకపోయావా, నాయనా?" రమారమి నాలుగు నెలలనుంచి వస్తూ పోతూ ఈనాటికి వ్యాధి తీవ్రరూపం దాల్చితే ఉద్వేగంతో అంది జానకమ్మ.

"చూపించానమ్మా. డబ్బు రాబట్టుకో డానికి ఏమేమో చెప్పాడు. వాళ్లకదేపనిగా! కళ్లకి చత్వారమట. పరీక్ష చేసి కళ్లజోడు ఎన్నిక చేశాడు. అది ఏభై రూపాయలట! పరీక్ష రుసుం పది రూపాయలట! ఏవేవో లేపనాలు పదిహేను రూపాయలట! వింటే మతిపోతుంది." తల పట్టుకున్నాడు సుందరం.

జానకమ్మ నిట్టూర్చింది. అంతకన్నా తను చేయగలిగిందేమిటి? అలాగే కానీయలేకపో యావా అని అంటే, కష్టపడ్డవాళ్లకు తెలు స్తుంది డబ్బు విలువ అంటాడు. అయినా వాడి బాగోగులు గురించి తను చెప్పడమేమిటి? ఏమయినా పసివాడా? — మౌనం వహించింది. మాతృహృదయం గనుక నిశ్శబ్దంగా ఏడవ గలిగింది.

రోజులు ముందుకు సాగిపోతున్నాయి. జానకమ్మ ప్రతిరోజూ చూస్తున్నది, సుందరం నులోచనాలు కొనుక్కున్నాడేమోనని. నెల తిరిగింది. మాతృహృదయం తల్లడిల్లిపోయింది.

"ఏం, నాయనా, ఆరోగ్యం ఎలా ఉంటు న్నది?" సుందరం ఆఫీసుకు సెలవుపెట్టి శిరోబాధతో మూలుగుతూ పడుకుంటే మనసు నీరయిపోయి అడిగింది తల్లి.

"ఆరోగ్యానికేమమ్మా! డెబ్బై అయిదు రూపాయలు కావాలి. పండుగ వారం రోజు లుంది: బట్టలకు వంద కావాలి. ఎలా వస్తాయో ఏమిటో అగమ్యగోచరంగా ఉంది."

"అవును, నాయనా" అనగలిగింది ఉప్పెనలా వస్తున్న దుఃఖాన్ని బలవంతాన దిగ్రమింగు కుంటూ.

'భగవాన్! నీ సుందర దృష్టిలో వాడి జీవితం ఒక శాపంగా పరిగణించిందేమి, తండ్రీ! వాడికి డబ్బే ప్రధానంగాని ఆరోగ్యం కాకుండా పోయిందే! ఐదు సంవత్సరాల నుంచి పొదుపు చేస్తున్న డబ్బులో వంద రూపాయలే వాడి ప్రాణమైతే, అమూల్యమైన వాడి కనుల మాటేమిటి, తండ్రీ? వాడు అంధుడు అయితే కన్నతల్లిగా నేను చూడగలనా? అది చూచేందు కేనా ఇంకా జీవంతో ఉన్నది నేను?' తల్లి కన్నీరు మున్నీరుగా దేవుని పటంముందు రోదించసాగింది.


సుందరం జ్వరం 'టైఫాయిడ్' లోకి


జర్మెక్స్
చర్మ వ్యాధులకు


ఎగ్జిమా, ఏనుగు దురద, తామర, మొటిమలు, ఉడుకు బొబ్బలు, పుండ్లు నివారించగలదు.
విటిల్స్ ఓరియంటల్ బామ్ & ఫార్మస్యూటికల్స్ లిమిటెడ్, మద్రాసు.

ప్రసిద్ధిచెందిన!
షాహిడక్కన్
సిగరెట్లనే
మీరు ఎల్లప్పుడు వాడండి
వెల:-10 సిగరెట్లు గల
ప్యాకెట్టు
16 న.పై. మాత్రమే


ఇప్పుడు జంట నగరాల లో కూడా లభించు చున్నవి
VST-K 163




దిగింది. దానికి తోడు కనులు ఉబ్బిపోయాయి. రెప్పలు తెరుచుకోవడంలేదు. ఈ రెండిటికీ కలిపి పది రూపాయలకే నెల్లాళ్ల వైద్యం చేసే వైద్యుడిని కుదుర్చుకున్నాడు. మందు దొక త్రోవ — రోగానిదొక త్రోవ.

అలివేణికి సర్వత్రా అంధకారం కనిపిస్తున్నది. అనంతమైన ఈ సువిశాల విశ్వంలో ఏ మూలో ఒక ఆశాజ్యోతి కనిపిస్తున్నా, అది ప్రచండ వాయుఘాతానికి చరమదశలో రెపరెపలాడిపోతూంది.

"అత్తయ్యా! వారి పంతం వారిదే. రోజులు గడిచేకొలదీ పరిస్థితి విషమించవచ్చును. చేయి జారితే మనం చేసేదేమీలేదు. ఇవి ఎవరికైనా ఇచ్చి ..." మంగళసూత్రాలు తీసింది.

"అలివేణీ!" జానకమ్మ పిచ్చిగా అరిచింది.

"క్షమించండి, అత్తయ్యా! నా జీవితానికి వెలుగు ప్రసాదించేవారికంటే, వారి కన్నుల కంటే నాకివి అత్యధికం కావు. వారికన్నా ముందు నా కనులకు అంధకారం వినా వేరు కనిపించటంలేదు. నాకు వెలుగు ప్రసాదించు, అత్తయ్యా." అత్తగారి పాదాలముందు ఒరిగిపోయింది.

"లేదు, అలివేణీ! నీ పుస్తెను నేను విక్రయించలేనమ్మా. నీ తాళిబొట్టును బజారుపాలు చేయలేను, తల్లీ. అలివేణీ — నేనీ పనిచేయలేను. ఎవరి కర్మ వారిది. వాడు చేసుకున్న పుణ్యం ఉంటే వాడు బ్రతుకుతాడు. వాడి కనులు మూసుకుపోతున్నా వాడు కనులు తెరవ ప్రయత్నించటం లేదు." జానకమ్మ హృదయం కరిగి నీరయి, వాగయి కనులనుండి ప్రవహిస్తున్నది.

ఒక వైపు మాతృ హృదయం,' మరొక వైపు కోడలి ఆక్రందన, వేరొక వైపు పరమ లోభి, పిసినారి అయిన కన్నకొడుకు ... గిరి శిఖరాన నిలుచున్న జానకమ్మను ఈ శక్తులన్నీ కలిసి బలవంతాన అగాధంలోకి తోస్తున్నాయి.

అలివేణి బజారుకు పరుగుపెట్టింది. తన తప్పును దైవం క్షమించగలడనే విశ్వాసంతో గడపదాటి పరుగు తీసింది. అలివేణి రొప్పుతూ రొజుతూ వచ్చింది. సుందరం బాధగా మూలుగుతున్నాడు.

"ఏవండీ! డాక్టరు దగ్గర కెడదాం. బండిని పిలవమంటారా?" ఆత్రంగా భర్త కనుల్లోకి చూస్తూ అంది.

"ఆఁ!" అన్నాడు సుందరం, భార్య ఏమంటూందో అర్థంచేసుకోడానికి ప్రయత్నిస్తూ.

"ఉండండి. బండిని పిలుస్తా. ఇదిగో డబ్బు. ఉంచండి" అంటూ డబ్బును భర్త జేబుల్లో ఉంచి వీధిలోకి పరుగుతీసింది.

అలివేణి గొంతు విని జానకమ్మ గదిలోకి వచ్చింది. జేబులో చెయ్యి పెట్టి, విడీ విడని రెప్పలను అల్లల్లాడిస్తూ కాగితాలను లెక్కిస్తున్న కన్నకొడుకును చూచింది.

ఆమె కన్నుల్లో శూలాలు గ్రుచ్చుకున్నాయి. రక్తమే ప్రవహిస్తున్నది.

"సుందరం! ఆ డబ్బు — అలివేణి మంగళసూత్రం అమ్మితే వచ్చింది, తెలుసా?" దయ, జాలి, కరుణ ఆమె హృదయంలో లవలేశమైనా లేకుండా వాటి స్థానే క్రౌర్యం నిండిపోయి, పొలికేక పెట్టింది.

"ఏమిటీ?" బలహీనంగా అన్నాడు సుందరం.

"నీ భార్య మెడలో — నీ సొమ్ము వెచ్చించి చేయించి కట్టిన మంగళసూత్రాలు బజారులో అమ్మగా వచ్చిన డబ్బది."

ఇంతలో వీధి గుమ్మంలో కలకలం. గుంపుగా జనం లోపలికి వస్తున్నారు.

"అలివేణి కారు కిందపడి ప్రాణాలు వదిలింది." పది కంఠాలు అస్తవ్యస్తంగా ఆ మాటనే ఉచ్చరించాయి.

"అలివేణీ!" గిరి శిఖరాలు దద్దరిల్లిపోయాయి జానకమ్మ ఆక్రందనకు. గుంపును తోసుకుని వీధిన పడింది. వీధి మలుపులో కటికనేలమీద రక్తపు మడుగులో బోర్లాపడిఉంది అలివేణి.

జానకమ్మ నెత్తిన పిడుగు పడింది. పిచ్చిదానిలా వెనక్కు తిరిగింది. ఇంటి వైపు పరుగు తీసింది. సుందరంను కొందరు పట్టుకుని తీసుకొస్తున్నారు.

"సుందరం ... కాదు. నీవు రాక్షసుడివి. మనుషులను చంపుకుతినే నరహంతకుడివి, నరభక్షకుడివి. నీ లోభత్వానికి బలి అయిన నీ భార్యను రక్తపు మడుగులో స్నానం చేయించావు. చూచి తనివితీరా ఆనందించరా. ఇక నుంచి చీరలు కొనే భారం తప్పింది. పోతూ పోతూ — నీవు కట్టిన తాళికి నీవు వెచ్చించిన సొమ్మును తాళి అమ్మి ఆ డబ్బు తిరిగి నీకే ఇచ్చి వెళ్లిపోయిందిరా. వెళ్లు. ఒంటిన బట్టలున్నాయి. వాటినీ ఒలుచుకో. వెళ్లు. వెళ్లు." జానకమ్మ స్పృహ కోల్పోయింది.

"అలివేణీ!" ప్రాణాలను కూడగట్టుకుని అరిచాడు సుందరం, దిక్కులు పిక్కటిల్లేటట్లు.

అలివేణిని ఆ పిలుపు చేరుకోలేదు. ★